

రాజన్నా శరణు.. శరణు
వేములవాడ: రాజన్నను శుక్రవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఈవో కృష్ణప్రసాద్, ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



గోశాలకు రాజన్న కోడెలు
వేములవాడఅర్బన్: రాజన్న 20 కోడెలను జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలం ముగ్ధం తండాలోని శ్రీఅంజనేయ గోశాలకు శుక్రవారం అందజేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
43.0/30.0

వాతావరణం
వాతావరణం వేడిగా ఉంటుంది. తీవ్ర వడగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

రాజ్‌భవన్‌లో నృత్య ప్రదర్శన



కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న గవర్నర్

వేములవాడ: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో వేములవాడకు చెందిన వాసాలమర్రి సాహితీభరద్వాజ్, శ్రీహితలు గవర్నర్ తమిళిసైతో కలిసి డ్యాన్స్ చేశారు. 'అడవిదారులు–ఆదివాసులు.. తెలింగ..తెలింగ ఇది తెలంగాణమూ..' అనే పాటకు నృత్యం చేశారు. అనంతరం చిన్నారులకు గవర్నర్ జ్ఞాపికలు అందజేశారు.

జడ్జికి సన్మానం



జడ్జి జ్యోతిర్మయిని సన్మానిస్తున్న లాయర్లు

వేములవాడ: వేములవాడ జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులైన జ్యోతిర్మయిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు ఆధ్వర్యంలో న్యాయవాదులు శాలువాకప్పి సత్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి సట్టు రవీందర్, ఏపీపీ విక్రాంత్, ఏజీపీ సదానందం, అడ్వకేట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నక్క దివాకర్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్ గౌడ్, గోపికృష్ణ, అనిల్‌కుమార్, వంగళ కర్ణ, కందుల క్రాంతి, నాగుల సంపత్, సుజీవన్, శంకర్, అంజయ్య, నారాయణరావు, బొడ్డు ప్రశాంత్, నర్సింగారావు, సుజాత, అన్నపూర్ణ పాల్గొన్నారు.

అమరుల త్యాగాల ఫలమే తెలంగాణ



జెండా ఎగురవేస్తున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ: అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ ఏర్పడిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పేర్కొన్నారు. స్వరాష్ట్రం సాధించి పదేళ్లలో అడుగిడుతున్న సందర్భంగా శుక్రవారం బీజేపీ కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో సుష్మాస్వరాజ్ తన ప్రసంగంలో తెలంగాణ ఏర్పాటుపై స్పష్టంగా మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు.

సోనియమ్మ దీవెనలతోనే స్వరాష్ట్రం



సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వేములవాడ: అమరుల త్యాగాలు, సోనియాగాంధీ దీవెనలతో స్వరాష్ట్రం తెలంగాణ ఏర్పడిందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజన్న గుడి ముందు సోనియాగాంధీ చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. చిలుక రమేశ్, వెంకటస్వామి, కూరగాయల కొమురయ్య, శ్రీనివాస్‌గౌడ్, పాత సత్యలక్ష్మి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లు సాధిస్తాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆవునూరి ప్రభాకర్

సిరిసిల్లటౌన్: ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు చేసినా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధిస్తామని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఆవునూరి ప్రభాకర్ పేర్కొన్నారు. జూన్ 5న నిర్వహిస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహాసభల పోస్టర్‌లను శుక్రవారం స్థానిక అంబేడ్కర్‌చౌక్‌లో ఆవిష్కరించారు. వర్గీకరణ చట్టబద్ధత సాధనకు జరిగే సభలకు మాదిగ, ఉపకులాల ప్రజలు పెద్ద ఎత్తున్న హాజరు కావాలని కోరారు. పార్టీ జిల్లా కోఆర్డినేటర్ ఖానాపురం లక్ష్మణ్, నాయకులు గుండా థామస్, నేరెళ్ల శ్రీనివాస్, విజేందర్, జాన్సన్, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎంతో సాధించాం..



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్



పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి



అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా అధికారులు రూపొందించిన బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్



వేడుకలకు హాజరైన జిల్లా అధికారులు, నాయకులు

- దేశానికి ఆదర్శంగా నిలిచాం
- సకల జనుల వికాసమే లక్ష్యం
- మంత్రి కె.తారక రామారావు
- సిరిసిల్లలో రాష్ట్ర అవతరణ వేడుకలు

సిరిసిల్ల: తొమ్మిదేళ్లలో ఎంతో అభివృద్ధి సాధించామని.. పాలన సంస్కరణలు, సంక్షేమంలో దేశానికి ఆదర్శమయ్యామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. తొమ్మిదేళ్లలో జిల్లా సాధించిన ప్రగతిని మంత్రి కేటీఆర్ తన ప్రసంగంలో వివరించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే...

'లక్ష'ణంగా సాగు

గోదావరి జలాలు జిల్లాకు రావడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. 2014–2015లో 1,77,960 ఎకరాలు ఉండగా.. ఇప్పుడది 2,40,430 ఎకరాలకు పెరిగింది. రైతులకు ఎకరానికి ఏటా రూ.10 వేలు పెట్టుబడి సాయం అందిస్తున్నాం. జిల్లాలోని 1,33,658 మంది రైతులకు పది విడతల్లో రూ.1,139 కోట్లు పెట్టుబడి సాయంగా అందించాం. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 973 ఎకరాల్లో 292 మంది రైతులు ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నారు. రూ.33కోట్లతో 55 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 14 గోదాములు నిర్మించాం. సర్దాపూర్‌లో రూ.20కోట్లతో 25 ఎకరా ల్లో ఆధునిక మార్కెట్ యార్డు, సిరిసిల్లలో రూ.5.15 కోట్లతో రైతుబజారు నిర్మించాం. వేములవాడలో రూ.4.50 కోట్లతో సమీకృత మార్కెటును నిర్మిస్తున్నాం. వివిధ కారణాలతో మరణించిన 1,803 మంది రైతుల కుటుంబాలకు రైతుబీమా ద్వారా రూ.90.15 కోట్ల పరిహారం అందించాం. 57 రైతువేదికలు నిర్మించాం. గంభీరావుపేట మండలం నర్మాలలో 309 ఎకరాల్లో రూ.150 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడ మూడు పరిశ్రమలు పూర్తయితే 800 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. జిల్లెల్ల వద్ద కోల్డ్‌స్టోరేజీ సెంటర్, బందనకల్‌లో నూనెగింజల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తాం. మిషన్ కాకతీయలో రూ. 102.79 కోట్లతో 294 చెరువులను బాగుచేశాం. మానేరు వాగుపై 11, మూలవాగుపై 13 చెక్‌డ్యామ్‌లను చేపట్టగా.. ఇప్పటికే 8 పూర్తయ్యాయి. సిరిసిల్ల మానేరు తీరం వెంబడి కరకట్ట నిర్మాణం సాగుతోంది.

ప్రతి ఇంటికి తాగునీరు

జిల్లాలోని 13 మండలాలు, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి మూడు మున్సిపాలిటీలలోని 447 ఆవాసాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నాం. టీఎస్ ఐ–పాస్ కింద రూ.1289 కోట్ల పెట్టుబడితో 809 పరిశ్రమల స్థాపించి, 6,472 మందికి ఉపాధి కల్పిస్తున్నాం. ఎస్సీ నిరుద్యోగులకు టీ ప్రైడ్ ద్వారా 1,070 పరిశ్రమలు, రవాణా వాహనాలకు రూ.55.78 కోట్ల రాయితీలు అందించాం.

సంక్షేమానికి బాటలు

జిల్లా వ్యాప్తంగా 1,21,142 మందికి వివిధ రకాల ఆసరా పెన్షన్లు అందిస్తున్నాం. కల్యాణలక్ష్మిలో రూ.1,00,116 చొప్పున 21,534 మందికి రూ.194.47 కోట్లు అందించాం. షాదీముబారక్‌లో 984 మందికి రూ.8.68 కోట్లు పంపిణీ చేశాం. వేములవాడ మండలం తిప్పాపూర్‌లో రూ.22.50 కోట్లతో వంద పడకల ప్రాంతీయ ఆస్పత్రిని నిర్మించాం. సిరిసిల్లలో రూ.159 కోట్లతో 300 పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించనున్నాం. జిల్లాలోని 206 కుటుంబాలకు దళితబంధు అందిస్తున్నాం.

జిల్లా కేంద్రంలో...

సిరిసిల్లలో రూ.100కోట్లతో వసతులు కల్పిస్తున్నాం. ఇప్పటికే సిరిసిల్ల స్వచ్ఛ సర్వేక్షణ్, ఓడీఎఫ్ ప్లస్ ప్లస్‌లో జాతీయస్థాయిలో అవార్డులు సాధించింది. శాంతినగర్‌లో రూ.61కోట్లతో ఆరెకరాల్లో మురికినీటి శుద్ధి సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నాం. ఆధునిక ధోబీఘాట్, రాజీవ్‌నగర్‌లో మినీస్టేడియం నిర్మించాం. బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశాం. పదిర శివారులో అర్బన్‌ఫారెస్ట్‌ను రూ.6 కోట్లతో 50 హెక్టార్లలో అభివృద్ధి చేస్తున్నాం. కొత్త చెరువును అభివృద్ధి చేశాం.

వేములవాడ అభివృద్ధికి..

ధార్మిక క్షేత్రం వేములవాడను సిరిసిల్లతో సమానంగా అభివృద్ధి చేస్తున్నాం. రూ.కోటితో వైకుంఠధామాలు, రూ.2.71కోట్లతో కూరగాయల మార్కెట్, రూ.4.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మిస్తున్నాం. మరో రూ.20 కోట్లతో పట్టణంలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. మూలవాగు బండ్ అభివృద్ధి, డంపుయార్డుల నిర్మాణం, కమాన్ జంక్షన్ అభివృద్ధి పనులు చేస్తున్నాం. స్వచ్ఛ సర్వేక్షణ్ –2023లో 5 స్టార్ రేటింగ్‌లో ప్రథమ స్థానంలో ఉన్నాయి.

నేతన్నల సంక్షేమం కోసం..

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రూ.2,500 కోట్ల ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు రావడంతో నేతన్నలకు ఏడాదంతా పని లభిస్తుంది. కార్మికుల సంక్షేమానికి త్రిఫ్ట్ పథకం అమలు, జనశ్రీ బీమా సౌకర్యం కల్పిస్తున్నాం. పెద్దూరు శివారులో 60 ఎకరాల్లో రూ.174 కోట్లతో అపెరల్ పార్క్ నిర్మిస్తున్నాం.

అమరవీరులకు నివాళి

సిరిసిల్ల పాత బస్టాండులోని నేతన్నచౌక్ వద్ద తెలంగాణ అమర వీరుల స్థూపానికి మంత్రి కేటీఆర్ పూలు చల్లి నివాళి అర్పించారు. స్థానిక నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.

మెడికల్ కాలేజీ
సిరిసిల్లలో ఈ ఏడాది మెడికల్ కాలేజీని ప్రారంభిస్తాం. ఎల్లారెడ్డిపేటలో వృద్ధులకు డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తున్నాం. పోడు భూములకు త్వరలోనే పట్టాలు అందిస్తాం. నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో పోలీస్ యంత్రాంగం పనిచేస్తుంది. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, డీఆర్‌వో టి.శ్రీనివాస్‌రావు, మాజీ ఎమ్మెల్యే రేగులపాటి పాపారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళాచక్రపాణి, రామతీర్థం మాధవి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు
జిల్లాలో 3,443 డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్దిదారులకు అందించాం. కొన్ని ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి వాటిని త్వరలోనే అందిస్తాం. సొంత జాగా ఉన్న వారికి త్వరలోనే గృహలక్ష్మిలో రూ.3 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తాం. ఇప్పటి వరకు 4.67కోట్ల మొక్కలు నాటాం. మన ఊరు–మన బడిలో రూ.48 కోట్లతో 172 స్కూళ్లలో వసతులు కల్పిస్తున్నాం. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో కార్పొరేట్ సంస్థల సహకారంతో గంభీరావుపేటలో కేజీ టు పీజీ కాంప్లెక్స్ ఏర్పాటు చేశాం.







సిరిసిల్లలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్

అభివృద్ధిపై డాక్యుమెంటరీ ప్రదర్శన

సిరిసిల్ల: జిల్లా అభివృద్ధిపై డాక్యుమెంటరీని కలెక్టరేట్‌లో శుక్రవారం మంత్రి కేటీఆర్ తిలకించారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా జిల్లా యంత్రాంగం రూపొందించిన ఏడు నిముషాల డాక్యుమెంటరీని ప్రదర్శించారు. మధ్యమానేరు జలాశయం, పంటల సాగు, బతుకమ్మ చీరలు, పరిశ్రమలు, వేములవాడ అలయ అభివృద్ధి, మిషన్ భగీరథ, మత్స్యపరిశ్రమ వంటి రంగాలకు ప్రాధాన్యతనిస్తూ జిల్లాలో సాధించిన ప్రగతిని కళ్లముందుంచారు. అంతకు ముందు 'ఏ స్టోరీ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ ట్రాన్స్‌ఫర్మేషన్' అనే శీర్షికతో రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను, వ్యవసాయ శాఖ రూపొందించిన వానాకాలం సాగు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రొటోకాల్ లేని బీఆర్ఎస్ నాయకులు వేదికపై కూర్చోవడం చర్చనీయాంశమైంది. కలెక్టరేట్ అధికారులు, సభా నిర్వాహకులు పిలువకపోయినా కొందరు నాయకులు వేదికపై కూర్చున్నారు. ప్రొటోకాల్ ఉన్న నాయకులు కొందరు వేదిక ముందు కూర్చోవడం విశేషం.



కుర్చీలు లేక నిల్చున్న సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్లు

సరిపోని కుర్చీలు

కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన ఆవిర్భావ వేడుకలకు జిల్లా నలుమూలల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు రావడంతో కుర్చీలు సరిపోలేదు. దీంతో సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, మహిళా కౌన్సిలర్లు నిల్చున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన తేనీటి విందు వద్ద తోపులాట జరిగింది. అందరూ సమావేశహాల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు కట్టడి చేశారు. వినతిపత్రాలు ఇచ్చేందుకు వచ్చిన వారు మంత్రి కేటీఆర్‌ను కలువకుండానే వెనుదిరగాల్సి వచ్చింది.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



విజేత మూడపల్లి జట్టుకు షీల్డ్ అందజేస్తున్న నాయకులు

చందుర్తి(వేములవాడ): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని బీఆర్ఎస్ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి కోరారు. మండలంలోని మూడపల్లిలో యునైటెడ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిలుక కొండయ్య జ్ఞాపకార్థం శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏనుగు మనోహర్‌రెడ్డి, విశాఖ ఇండస్ట్రియల్ డైరెక్టర్ జేపీరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. విజేతగా మూడపల్లి జట్టుకు రూ.40వేలు, షీల్డు, రన్నరప్ అన్నారం జట్టుకు రూ.20వేలు, షీల్డ్‌లను జేపీరావు సహకారంతో అందించారు. సర్పంచ్ అంజిబాబు, స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ నీరటి శ్రీనివాస్, మ్యాకల ఎల్లయ్య, బైరగోని రమేశ్, సిరికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

10న జాతీయ లోక్ అదాలత్
సిరిసిల్లటౌన్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో ఈనెల 10న నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా జడ్జి ఎస్.ప్రేమలత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ కోర్టుల పరిధిల్లోని రాజీపడే కక్షిదారులు రాజీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పనులు ప్రజలకు తెలియాలి

వేములవాడ: రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఈనెల 7న సాగునీటి దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగ నిర్వహణపై ఇరిగేషన్ అధికారులతో వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు శుక్రవారం తన నివాసంలో సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటిపారుదల రంగంలో సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియజేద్దామన్నారు. తెలంగాణ రాకముందు, వచ్చిన తర్వాత వచ్చిన జరిగిన అభివృద్ధిని ప్రజలకు చూపించాలని కోరారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్లో నీరు నిలిచి పెరిగిన భూగర్భ జలాలు, పంట విస్తీర్ణం, మత్స్యసంపద తెలియజేయాలన్నారు. మూలవాగుపై నిర్మించిన 12 చెక్‌డ్యామ్‌లతో నిండుకుండలా ఉంటుందన్నారు. రాజన్న గుడిచెరువు సైతం గోదావరి జలాలతో కళకళలాడుతుందన్నారు. ఆర్డీవో పవన్‌కుమార్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఇరిగేషన్ ఈఈలు సుమతిదేవి, అమరేందర్‌రెడ్డి, సంతు ప్రకాశ్, జగన్, ఆలయ ఈఈ రాజేశ్ పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

ధాన్యం కొనుగోలు చేయండి

ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కోరారు. చైర్‌పర్సన్ మాధవి ఉన్నారు.

ఉత్తమ పోలీసులకు సేవా పతకాలు

సిరిసిల్లక్రైం: పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి సేవా పతకాలను ఎస్పీ అఖిల్ మహజన్ అందజేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 10 మంది సిబ్బందికి ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలు అందజేశారు. టౌన్ సీఐ అనిల్‌కుమార్, ఏఎస్సై బాబు(గంభీరావుపేట), ఏఆర్ పోలీస్ సిబ్బంది ప్రభాకర్, స్వామిరావు, తంగళ్లపల్లి కానిస్టేబుల్ వెంకటేశ్, హోమ్‌గార్డులు ప్రకాశ్, ఇక్బాల్ పాషా, నర్సింహప్రసాద్, దేవరాజ్, మల్లేశంకు అతి ఉత్కృష్ట సేవా పథకాలను ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు.



సీఐ అనిల్‌కుమార్‌కి సేవా పతకం అందిజేస్తున్న ఎస్పీ

వలస కూలీల వివరాలు సేకరణ

- వేలి ముద్రలు.. ఫొటోలు రికార్డు చేసిన పోలీసులు
- దొంగతనాలతో అప్రమత్తమైన పోలీసుశాఖ
- రాజన్నపేట ఘటనలో ముగ్గురి గుర్తింపు
- దొంగల కోసం గాలిస్తున్న పోలీసులు



కూలీల వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో జరుగుతున్న వరుస దొంగతనాలు.. జిల్లాకు ఇబ్బడిముబ్బడిగా వచ్చి చేరుతున్న వలసకూలీల ఆగడాలపై 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన 'పగలు రెక్కి.. రాత్రి చోరీ' కథనానికి పోలీస్ అధికారులు స్పందించారు. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి ఉపాధి కోసం వచ్చిన వలస కూలీల వివరాలు సేకరిస్తున్నారు. బ్రోకర్లను ముందుగా స్టేషన్‌కు పిలిపించి వారి వద్ద పనిచేస్తున్న వలస కార్మికుల వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. బ్రోకర్లు ఇచ్చిన జాబితా ప్రకారం వలస కూలీల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. వలస కార్మికులను గుర్తించేలా వేలిముద్రలు, ఫొటోలను సేకరించి కంప్యూటర్‌లలో భద్రపరుస్తున్నారు. అదే సమయంలో పాతనేరస్తుల వివరాలు సైతం సేకరిస్తున్నారు. కాగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో దొంగలను గుర్తించలేకపోతున్నామని పోలీసులు భావిస్తున్నారు.

ముగ్గురు దొంగల గుర్తింపు

ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో ఒకే రోజు రాత్రి ఏడు ఇళ్లలో వరుస దొంగతనాలకు పాల్పడ్డ ముగ్గురిని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. దొంగల కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి గాలిస్తున్నట్లు సమాచారం. దొంగతనం జరిగిన మరుసటి రోజే వారు రాష్ట్రం దాటి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. జిల్లాలో దొంగతనాలను అరికట్టేందుకు పోలీసుశాఖ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయడమే కాకుండా, నిఘాను పెంచింది.

క్లుప్తంగా

విద్యార్థినికి సన్మానం



ప్రభావతిని సన్మానిస్తున్న సర్పంచ్, హెచ్ఎంలు

చందుర్తి(వేములవాడ): మండలంలోని మూడపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరి–ప్రభాకర్ దంపతుల కుమార్తె ప్రభావతి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించడంతో జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ చిలుక అంజిబాబు, ప్రధానోపాధ్యాయుడు ప్రతాపనవీన్, యునైటెడ్ స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి నీరటి శ్రీనివాస్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మద్దికుంట వాసి మృతి



దేవరాజు(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని మద్దికుంటకు చెందిన సూత్రపు దేవరాజు(36) నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మద్దికుంటకు చెందిన సూత్రపు దేవరాజు నిజామాబాద్ జిల్లా సారంగపూర్‌లో క్షౌ రవృత్తిలో స్థిరపడ్డాడు. దేవరాజు బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దేవరాజు తీవ్రంగా గాయపడగా ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. దేవరాజు మృతదేహాన్ని మద్దికుంటకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వడదెబ్బతో కూలీ..



శంకర్ (ఫైల్)

వేములవాడ : పట్టణంలో దినసరి కూలీగా పని చేస్తున్న గోనెల శంకర్ (53) శుక్రవారం వడదెబ్బతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. వేములవాడ రూరల్ మండలం లింగంపల్లికి చెందిన శంకర్ వేములవాడలో కూలీ పనికి వెళ్తున్నాడు. శుక్రవారం కూలీ పనికి వచ్చిన శంకర్ కుప్పకూలి పడిపోయాడు. చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రూరల్ సెస్ డైరెక్టర్ దేవరాజం, సర్పంచ్ కవిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఆకుల దేవరాజం తెలిపారు. మృతుడికి భార్య తిరుమల, కూతుళ్లు శ్రావ్య, హర్షిణి ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

చందుర్తి : జీవనోపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లిన కార్మికులు ఓటర్ లిస్ట్‌లో ఎన్నారై ఓటర్లుగా పేర్లను నమోదు చేయించుకోవాలని గల్ఫ్ జెఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్ కోరారు. మండలంలోని మల్యాలలో గల్ఫ్ కార్మికుల ఇంటింటా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గల్ఫ్ జెఏసీ చైర్మన్ రవిగౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఫారం 6–ఏ ద్వారా ఆన్‌లైన్‌లో ఎన్నారై ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఎమిగ్రేషన్ యాక్టు ప్రకారం లైసెన్స్ కలిగి రిక్రూటింగ్ ఏజెంట్‌కు గరిష్టంగా సర్వీస్ చార్జి చెల్లించి విదేశాలకు వెళ్లాలని కోరారు. గల్ఫ్ జెఏసీ సభ్యులు ఉన్నారు.

6న మెగా జాబ్‌మేళా

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల పట్టణంలోని వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 6న పద్మనాయక కల్యాణ మండపంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్లు దిడ్డి శ్రీనివాస్, గుగ్గిళ్ల జగన్‌గౌడ్ తెలిపారు. 50పైగా కార్పొరేట్ కంపెనీలు పాల్గొంటాయని, 2016 నుంచి 2023లో పది, ఇంటర్, డిగ్రీ, పీజీలో పాసైన నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9912231731, 8374768684 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

బాసర ట్రిపుల్‌ఐటీ పిలుస్తోంది

- 5 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- 19 వరకు గడువు
- 26న తొలి జాబితా విడుదల
- పదోతరగతి పూర్తయిన విద్యార్థులకు సువర్ణావకాశం



బాసర ట్రిపుల్‌ఐటీ ముఖద్వారం

కరీంనగర్/కోనరావుపేట(వేములవాడ): పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ)లో బీటెక్ చదువుకోవడానికి అవకాశం ఉంది. ఈ మేరకు మే 31న నోటిఫికేషన్ జారీ అయింది. చాలా మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు దరఖాస్తు చేయడం తెలియక ఆందోళన చెందుతుంటారు. కొన్నిసార్లు పొరపాట్లతో సీటు చేజార్చుకుంటారు. ఈ నేపథ్యంలో దరఖాస్తు విధానం, తేదీలు తదితర వివరాలపై కథనం.

రెగ్యులర్ విద్యార్థులకే..

బాసర ట్రిపుల్‌ఐటీలో ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ డిగ్రీ 2023–24 విద్యాసంవత్సరానికి గాను 1500 సీట్లతోపాటు ఈడబ్ల్యూఎస్ కోటా కింద మరో 150 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. ఎస్సెస్సీ లేదా తత్సమాన పరీక్ష 2023లో రెగ్యులర్ విద్యార్థులు ప్రథమ ప్రయత్నంలోనే ఉత్తీర్ణులై ఉండాలి. 31–12–2023 నాటికి వయసు 18 ఏళ్లకు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 21 సంవత్సరాలుగా నిర్ణయించారు.

ఎంపిక ప్రక్రియ ఇలా..

పదోతరగతిలో సాధించిన జీపీఏ (గ్రేడ్ పాయింట్ యావరేజ్), ప్రతీ సబ్జెక్ట్‌లో అభ్యర్థి పొందిన గ్రేడ్ ప్రతిభ ఆధారంగా రిజర్వేషన్లకు లోబడి ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశాలు, ఆర్జీయూకేటీ నిబంధనలను అనుసరించి ప్రవేశాల కోసం నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఆదర్శ పాఠశాలల్లో చదివినవారి జీపీఏకు 0.4 పాయింట్లు కలుపుతారు. రాష్ట్రపతి, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మొత్తం సీట్లలో 85 శాతం తెలంగాణ విద్యార్థులకు, మిగతా 15 శాతం అన్‌రిజర్వుడ్ సీట్లను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యార్థులకు కేటాయిస్తారు. ఈ రెండు రాష్ట్రాల విద్యార్థులే కాకుండా ఇతర రాష్ట్రాల వారికి గ్లోబల్ కేటగిరీ కింద 5 శాతం సీట్లు రిజర్వ్‌గా, గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న భారతీయుల పిల్లలకు 2 శాతం సీట్లు ఉంటాయి. రాష్ట్రపతి ఉత్తర్వులు ఆర్టికల్ 371–డి, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లకు లోబడి అన్ని రిజర్వేషన్లు వర్తింపజేస్తూ ఎంపిక ప్రక్రియ చేపడుతారు.

దరఖాస్తు చేసుకునే విధానం..

ఈ–సేవ, టీఎస్ ఆన్‌లైన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ అభ్యర్థులు దరఖాస్తు ఫీజు రూ.500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 450 చెల్లించాల్సి ఉంటుంది. ఇతర రాష్ట్రాల, గ్లోబల్ అభ్యర్థులకు రూ.1,500, ఎన్నారై ఇంటర్నేషనల్ విద్యార్థులకు 100 యూఎస్ డాలర్లు చెల్లించాలి. ఒకటి కంటే ఎక్కువ సార్లు దరఖాస్తు చేసుకుంటే చివరగా చేసిన దరఖాస్తును పరిగణలోకి తీసుకుంటారు. హార్డ్ కాపీలను ఈ కింద చిరునామాకు రిజిష్టర్ పోస్ట్‌లో చేయాలి. 'ద డైరెక్టర్, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్, బాసర, నిర్మల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, పిన్. 504107'కు పంపాలి. కవర్‌పైన అప్లికేషన్ ఫర్ అడ్మిషన్ 2023 ఆర్జీయూకేటీ బాసర అని రాయాలి.

ముఖ్యమైన తేదీలు..

దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ : 19 జూన్ 2023
ఎంపికైన విద్యార్థుల ప్రకటన : 26 జూన్ 2023
కౌన్సెలింగ్ : 1 జూలై నుంచి
పూర్తి వివరాలకు బాసర ట్రిపుల్‌ఐటీ వెబ్‌సైట్ rgukt.ac.in సందర్శించవచ్చు.

కల్పించే సౌకర్యాలు..

ఎంపికైన ప్రతీ విద్యార్థికి ఆరేళ్లపాటు నాణ్యమైన విద్య, ల్యాప్‌టాప్ ఉచితంగా అందిస్తారు. అలాగే ఉచితంగా యూనిఫామ్స్, ఏడాదికి రెండు జతల షూ, హాస్టల్‌లో అన్ని వసతులు కల్పిస్తారు.

దరఖాస్తుతో వీటిని జత చేయాలి..

ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించిన తర్వాత ప్రింట్ తీసుకొని, ఆన్‌లైన్ ఫీజు రసీదు, పదో తరగతి హాల్‌టికెట్ జిరాక్స్ కాపీ, పదో తరగతి వరకు విద్యా ధ్రువపత్రాలు, ఆన్‌లైన్‌లో తీసిన పదోతరగతి మార్కుల మెమో, కుల ధ్రువీకరణ పత్రం, రిజర్వుడ్ కేటగిరీ అభ్యర్థులు(దివ్యాంగులు, ఆర్మీ కుటుంబీకులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ తదితరులు) తమ సర్టిఫికెట్ల జిరాక్స్‌లను దరఖాస్తు ఫాంకు జతచేసి, జూన్ 5 నుంచి 19లోగా అందేలా చూసుకోవాలి. ఎంపికైన సమాచారాన్ని అభ్యర్థులకు పోస్ట్, ఎస్ఎంఎస్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలియజేస్తారు. కౌన్సెలింగ్ సమయంలో అభ్యర్థులు వ్యక్తిగతంగా ఆర్జీయూకేటీ బాసరలో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలి. సెమిస్టర్ కలుపుకొని సంవత్సర ఫీజు రూ.37 వేలు ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉన్నవారు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. తెలంగాణకు సంబంధించిన ఎన్నారైల పిల్లలు ఎంపికైతే ఏడాదికి రూ.1.36 లక్షలు, మిగతా ఎన్నారైలు అయితే రూ.3.01 లక్షలు చెల్లించాలి. ప్రవేశ సమయంలో ఆరోగ్యబీమా ఇతరాలకు సంబంధించి రూ.3,500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.3 వేలు చెల్లించాలి.

సీట్లకు తీవ్రమైన పోటీ..

బాసర ట్రిపుల్‌ఐటీలో ఉన్న 1,500 సీట్లకు తీవ్రమైన పోటీ ఉంటుంది. గతేడాది దాదాపు 33 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

ఎంపికకు రిజర్వేషన్లు..

ఎస్సీలకు 15, ఎస్టీలకు 10, బీసీ(ఏ)కు 7, బీసీ(బీ)కి 10, బీసీ(సీ)కి 1, బీసీ(డి)కి 7, బీసీ(ఈ)కి 4, ఈడబ్ల్యూఎస్ వారికి 10, దివ్యాంగులకు 3, సైనిక ఉద్యోగుల పిల్లలకు 2, ఎన్‌సీసీకి 1, స్పోర్ట్స్ కోటా వారికి 0.5, బాలికలకు 33.33 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి.

పలకరింపులు.. పరామర్శలు



దేశాయిపల్లెలో కిట్టు భార్యకు ధైర్యం చెబుతున్న మంత్రి కేటీఆర్

- పలు గ్రామాల్లో పర్యటించిన మంత్రి కేటీఆర్
- వివాహ వేడుకలకు హాజరు



వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి కేటీఆర్

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలో శుక్రవారం మంత్రి కేటీఆర్ పర్యటన పలకరింపులు, పరామర్శలతో సాగింది. ముందుగా అంకుషాపూర్‌లో సర్పంచ్ కొయ్యడ ఎల్లవ్వ– నాంపెల్లి దంపతుల కూతురు చనిపోగా వారిని పరామర్శించారు. బస్వాపూర్ ఎంపీటీసీ పూర్మాణి కనకలక్ష్మీ కుమారుడి వివాహం ఇటీవల జరగగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. అంకిరెడ్డిపల్లెలో సర్పంచ్ ముచ్చంతుల కమల గోపాల్ రెడ్డి దంపతులను పరామర్శించారు. పితృవియోగం చెందిన దేశాయిపల్లె సర్పంచ్ నకీర్తి బాలమల్లును, అదే గ్రామానికి చెందిన గట్టు బాల్‌రెడ్డి (కిట్టు) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు.. అధైర్యపడవద్దని బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మంత్రి కేటీఆర్ అన్నారు. కిట్టు భార్యకు వ్యవసాయ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు. మరోసారి వచ్చినపుడు ఆర్డర్ కాపీని అందజేస్తానని మంత్రి తెలిపారు. మంత్రి వెంట జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, ఎంపీపీ పడిగెల మానస, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, వలకొండ వేణుగోపాల రావు, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, వైస్ చైర్మన్ రమణా రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ సింగిరెడ్డి రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న మంత్రి కేటీఆర్

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్ సింగిల్‌విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి కూతురు భవిత వివాహం తిరుపతి రెడ్డితో జరగగా మంత్రి కేటీఆర్ నూతన వధూ వరులను శుక్రవారం ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి మంత్రి కేటీఆర్‌ను సన్మానించి, మెమెంటో అందజేశారు.

ప్రజల నుంచి విజ్ఞప్తులను మంత్రి స్వీకరించారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్లు బాపురావు, రాజేందర్ రెడ్డి, నాయకులు సురేందర్ రావు, విజయరామారావు, అంజన్‌రావు, బాలయ్య, సర్వర్, బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులున్నారు.

పెద్దూర్‌లో..

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరుకు చెందిన 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ కూతురు వివాహానికి మంత్రి కేటీఆర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. బీఆర్ఎస్ యూత్ నాయకుడు సలేంద్రి వేణుగోపాల్ యాదవ్ సోదరుడి వివాహం జరగగా నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, తదితరులున్నారు.

సొంత ఖర్చుతో గుంట స్థలం కొనిస్తా

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అధైర్య పడకమ్మా.. అండగా నేనున్నా సొంత ఖర్చుతో గుంట భూమి కొనిస్తా, నీ కూతురును చదివిస్తా అని మంత్రి కేటీఆర్ ఓ మహిళకు ధైర్యం చెప్పారు. మండలంలోని దేశాయిపల్లెకు చెందిన జూపల్లి వరలక్ష్మి భర్త ఆరేళ్ల చనిపోగా కూతురిని పోషించుకుంటోంది. గ్రామానికి వచ్చిన మంత్రి కేటీఆర్‌ను కలిసి తనకు సొంతిల్లు లేదని కనీసం స్థలం కూడా లేదని ప్రాధేయపడింది. స్పందించిన మంత్రి కేటీఆర్ ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయా..? అని సర్పంచ్ బాలమల్లును అడగగా లేవని చెప్పటంతో ప్రైవేటు భూమి అందుబాటులో ఉంటే చూడాలని తన సొంత ఖర్చుతో స్థలం కొనిస్తానని హామీ ఇచ్చారు.

రంగం చెరువు, అటవీభూమి కబ్జా

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి
- గ్రామస్తులతో కలిసి బీజేపీ నాయకుల ఆందోళన



చెరువు వద్ద రైతులు, నాయకుల ఆందోళన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్‌లోని రంగంచెరువుతోపాటు అటవీభూములు కబ్జాకు గురవుతున్నాయని పేర్కొంటూ గ్రామస్తులు శుక్రవారం ఆందోళనకు దిగారు. వీరి ఆందోళనకు బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ జిల్లాలో ఒకరు పెద్దమనిషిలా చలామణి అవుతూ.. భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారులతో కుమ్మక్కై చెరువులు, అటవీభూములను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్మాస్‌పూర్ గ్రామస్తులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. కబ్జాకు గురైన చెరువు, అటవీభూమిని కాపాడాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, సాయి, భాను, కృష్ణహరి, స్వామి, రాజు, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి



బైక్ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలో సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రం దొరలపాలైందని, గ్రామ గ్రామాన బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గౌస్, లింగంగౌడ్, గిరిధర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ దశాబ్ది వేడుకలు ప్రారంభం



క్యాంప్ ఆఫీస్‌లో జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్



జెండావిష్కరిస్తున్న ఆర్‌బీఎస్ కో ఆర్డినేటర్ నర్సయ్య



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా సెషన్స్ జడ్జి ప్రేమలత



వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్, నాయకులు

- ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ
- పాల్గొన్న అన్ని పార్టీల నాయకులు



బీఆర్ఎస్ కార్యాలయంలో..



తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో బీజేపీ నాయకులు

సిరిసిల్లటౌన్ : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకలు శుక్రవారం సిరిసిల్లలో మిన్నంటాయి. జిల్లా కోర్టులో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి కే. ప్రేమలత జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, అడిషనల్ జడ్జి హిమబిందు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, మండల న్యాయ సేవాసమితి సభ్యుడు చింతోజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. గాంధీచౌక్‌తో పాటు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో చైర్‌పర్సన్ జిందం కళ జాతీయ జెండాను ఎగురవేశారు. కమిషనర్ వెల్దండి సమ్మయ్య, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. డీటీవో కొండల్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ విజయ్‌కుమార్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శంకరయ్య, ఆర్ఎస్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ గడ్డం నర్సయ్య జాతీయ జెండావిష్కరించారు.

జాతీయ జెండా ఆవిష్కరణ

సిరిసిల్ల పట్టణంలో తెలంగాణ ఆవిర్భావ వేడకలు ఘనంగా జరిగాయి. అన్ని చోట్లలో జాతీయ జెండాలను ఎగురవేశారు. పట్టణ టీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, జిల్లా కాంగ్రెస్ ఆఫీస్‌లో అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించగా కే.కే. మహేందర్‌రెడ్డి, నాగుల సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు. గాంధీ చౌక్‌లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి గుంటి వేణు, వాడవాడనా జాతీయ జెండాలు ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు.

అమర వీరులకు నివాళి..

పాత బస్టాండ్‌లోని అమరవీరుల స్మారక స్థూపానికి మంత్రి కేటీఆర్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ఆధ్వర్యంలో తెలంగాణ అమర వీరులకు పాలకవర్గం నివాళులు అర్పించారు. తెలంగాణ తల్లి, అంబేడ్కర్, గాంధీ, చేనేతకారుడి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అన్నిపార్టీల ప్రతినిధులు, తెలంగాణ అభిమానులు నివాళులు అర్పించారు. కౌన్సిలర్లు కార్యాలయాల వద్ద జెండాలను ఎగురవేశారు.

వేములవాడలో..

వేములవాడ : వేములవాడలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, కార్మిక సంఘాలు, పార్టీల నాయకులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఆలయంలో ఈవో కృష్ణప్రసాద్, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్, సెస్ కార్యాలయాల్లో డైరెక్టర్లు నామాల ఉమ, ఆకుల దేవరాజం, కోర్టులో జడ్జి, న్యాయవాదులు జెండా ఎగురవేశారు. అనంతరం అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన మంత్రి గంగుల కమలాకర్



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి కేటీఆర్ విదేశీ పర్యటన ముగించుకుని తెలంగాణ చేరుకున్న సందర్భంగా తొలిసారి కలిసి.. తెలంగాణకు భారీగా పెట్టుబడులు తెచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం



మాట్లాడుతున్న సత్యనారాయణ

సిరిసిల్ల కల్చరల్: శివాజీ మహరాజ్ ఛత్రపతిగా పట్టాభిషేకం జరిగిన సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూనగర్‌లోని అంబా భవాని ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా సహ సంఘ్ చాలక్ ఎనగందుల సత్యనారాయణ హాజరై మాట్లాడారు. ప్రతి యువకుడు దేశ సమగ్రతను పరిరక్షించడంలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొండవేని కిరణ్, ఆర్ఎస్ఎస్ నగర కార్యవాహ్ కొండి సురేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాలయాల్లోనే నాణ్యమైన విద్య

- డీఐఈవో మోహన్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఐఈవో

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి(డీఐఈవో) మోహన్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో అందిస్తున్న విద్య, సదుపాయాలపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అధ్యాపకులు సత్యనారాయణ, పర్శరాములు, చంద్రమౌళి, భూమక్క, కవిత, విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై శేఖర్

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మూడు నెలల క్రితం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు సీఈఐఆర్ ద్వారా గుర్తించి శుక్రవారం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన మైదం శెట్టి మల్లికార్జున్ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్లు ఏప్రిల్ 5న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించగా బాధితుడికి ఎస్సై శేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, చోరీ అయినా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఇక్కడ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.